# మన దేవరకద్ర

మన ఎమ్మెల్యే GMR

దేవరకద్ర | భూత్పూర్ | అడ్డాకల్ | చిన్నచింతకుంట | కొత్తకోట

20-06-2025 సంపుటి: 01 సంచిక: 01





రాజకీయ వారసత్వం లేదు. వేలకోట్ల డబ్బు.. దాబూ దర్పం లేదు. సిండికేట్ దందాలు లేవు.. సినిమా గ్లామర్ లేదు. అయితేనేం, క్రమశిక్షణ ఉంది. దూరదృష్టి ఉంది. తనను గెలిపించిన గడ్డను అభివృద్ధి చేయాలన్న ఆకాంక్ష ఉంది. ఆయన ఎవరో కాదు.. తనను నమ్ముకున్న ప్రజలను ప్రగతి పథంలో నడిపించాలన్న దృఢ సంకల్పంతో ముందుకెళ్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్). ఎండిన పొలాలు, వలస బతుకులు.. నిరుద్యోగం, పేదరికం వారసత్వంగా వస్తున్న దేవరకద్ర ప్రాంతాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చాలని సంకల్పించిన జీఎంఆర్.. గత 18 నెలల్లో కోట్ల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నారు. దేవరకద్రను ప్రపంచ పటంలోకి ఎక్కించేలా.. నిరుద్యోగ యవకుల జీవితాల్లో వెలుగులు నింపేలా జాతీయ ప్రాజెక్టును తీసుకొస్తున్నారు.









# అనితర సాధ్యుడు!

## జీఎంఆర్ కృషితో దేవరకద్రకు డిఫెన్స్ కారిడార్

## ఎమ్మెల్యే చొరవతో మన వద్దకు బ్రహ్మోస్ మిసైల్ తయారీ యూనిట్

### దేవరకద్ర ఏరియాలో డిఫెన్స్ ఆఫీసర్ల పర్యటన

### సీఎం రేవంత్ రెడ్డితో భేటీ.. కేంద్ర రక్షణ సెంటర్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

### 8 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

### దేవరకద్రను ప్రపంచపటంలోకి ఎక్కించిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

### గెలిచిన 18 నెలల్లోనే కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మంజూరు

పాలమూరు జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టించాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష.. కరువు సీమను.. సిరులు సీమగా మార్చాలన్న దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ సంకల్పంతో.. మహబూబ్ నగర్ జిల్లాకు మంచి రోజులు వచ్చాయి. బ్రహ్మోస్ మిసైల్ తయారీ యూనిట్, డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు దేవరకద్ర నియోజకవర్గంలో ఏర్పాటు కాబోతున్నది. దీనిపై ఇప్పటికే కేంద్రం నుంచి అనుమతి రాగా.. తాజాగా డిఫెన్స్ అధికారులు బ్రహ్మోస్ జనరల్ డైరెక్టర్, డీఆర్డీవో ఆఫీసర్లు దేవరకద్ర నియోజకవర్గంలోని చౌదర్ పల్లి - బస్వాయ పల్లి గ్రామాల్లో 400 ఎకరాల భూమిని సందర్శించి ఫైనల్ చేశారు.

**జీఎంఆర్ మార్క్**

తెలంగాణకు డిఫెన్స్ కారిడార్ మంజూరైందన్న విషయం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్.. ఆ ప్రాజెక్టును దేవరకద్ర నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం కోసం ఎంతో శ్రమించారు. సెంటర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని ముందే గుర్తించిన జీఎంఆర్.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎం ఆదేశాలతో బ్రహ్మోస్ జనరల్ డైరెక్టర్ జైతీర్థ జోషి, బ్రహ్మోస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. సాంబశివ ప్రసాద్, డీఆర్డీవో డైరెక్టర్ జీఏ శ్రీనివాస్ మూర్తి ఇటీవల దేవరకద్రకు వచ్చారు. జీఎంఆర్ వారిని దగ్గరుండి తీసుకువెళ్లి.. చౌదర్ పల్లి - బస్వాయ పల్లి గ్రామాల్లో ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ భూమిని చూపించి.. సెంటర్ ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను కూలంకషంగా వివరించారు. దీంతో అధికారులు సంతృప్తి చెందడమే కాకుండా.. రెండు సెంటర్లను ఇక్కడే స్థాపించేందుకు ఒప్పుకున్నారు.



### వేలాది మందికి ఉపాధి

ఇప్పటికే యూపీ, తమిళనాడులో రెండు డిఫెన్స్ కారిడార్లు ఉండగా.. దేవరకద్రలో ఏర్పాటు కాబోతున్న డిఫెన్స్ కారిడార్ మూడోది. ఇక్కడ రక్షణ రంగానికి సంబంధించిన యుద్ధ పరికరాలు, స్పేస్ పరికరాలు, సంబంధిత విడి భాగాలు తయారు చేస్తారు. బ్రహ్మోస్ మిసైల్ అనుబంధ పరికరాల ఉత్పత్తి చేస్తారు. మొత్తంగా ఇక్కడ రెండు కారిడార్లు ఏర్పాటు అయితే.. దాదాపు8 వేల నుంచి 10 వేల మందికి ఉపాధి దొరుకుతుంది. డిఫెన్స్ సెంటర్ ఏర్పాటు కోసం కేంద్రం రోడ్లు, ఇతర మౌలిక వసతులు మెరుగుపరుస్తుంది. ఫలితంగా దేవరకద్ర నియోజకవర్గం అభివృద్ధి వైపు దూసుకెళ్తుంది. కాంగ్రెస్ పార్టీలో ఎంతో మంది సీనియర్ నాయకులు, మంత్రులు ఉన్నా.. వారందరినీ కాదని.. సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి.. ఇంత భారీ ప్రాజెక్టును ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తమ నియోజకవర్గానికి తీసుకురావడం.. వేలాది మంది యువతకు ఉపాధి కల్పించబోతుండటంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిజంగా జీఎంఆర్ అనితర సాధ్యుడు అంటూ సోషల్ మీడియాలో యువత కామెంట్లు పెడుతున్నారు.





